# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 15-05-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- ప్రధానమంత్రి నరేంద్రమోదీ యూఏఈ అధ్యక్షుడు షేక్ మహమ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్‌తో అబుదబిలో ఈరోజు సమావేశమయ్యారు.
- బహుపాక్షికత లక్ష్యాన్ని సాధించే దిశగా బ్రిక్స్ భాగస్వామ్య దేశాలతో కలిసి పనిచేసేందుకు భారత్ అంకిత భావంతో ఉందని విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ స్పష్టం చేశారు.
- భారత దేశ జాతీయ భద్రత.. ఆత్మనిర్భరతపైనే ఆధారపడాలని రక్షణ మంత్రి రాజ్‌నాధ్ సింగ్ ఉద్ఘాటించారు.
- NEET UG 2026 పునఃపరీక్షను వచ్చే నెల 21వ తేదీన నిర్వహించనున్నట్టు కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తెలియజేశారు.

= = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్రమోదీ యూఏఈ, యూరప్‌లలో పర్యటనలో భాగంగా ఈరోజు అబుదాబి చేరుకున్నారు. అక్కడి ప్రెసిడెన్షియల్ ఎయిర్‌పోర్ట్‌లో యూఏఈ అధ్యక్షుడు షేక్ మహమ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్ ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ప్రధానమంత్రి నరేంద్రమోదీ, అధ్యక్షుడు షేక్ మహమ్మద్ బిన్ జాయెద్‌తో సమావేశమై, వివిధ అంశాలపై చర్చలు జరిపారు. ప్రధానంగా ఇంధన సహకారం, ద్వైపాక్షిక వాణిజ్యం అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా నరేంద్రమోదీ మాట్లాడుతూ.. యూఏఈపై ఇటీవల జరిగిన దాడులను తీవ్రంగా ఖండించారు. అవి పూర్తిగా ఆమోదయోగ్యం కాదని పేర్కొన్నారు. క్లిష్ట సమయాల్లో యూఏఈ నాయకత్వం చూపిన స్థైర్యాన్ని ఆయన ప్రశంసించారు. ఎమిరేట్స్‌కు భారతదేశం మద్దతు ఉంటుందని పునరుద్ఘాటించారు. ప్రస్తుత ప్రపంచ సంఘర్షణల కాలంలో చర్చలు, దౌత్యం మాత్రమే ముందుకు సాగే ఏకైక మార్గమని నరేంద్రమోదీ పేర్కొంటూ...

(వాయిస్…30 సెకన్లు)

కాగా.. పెట్రోలియం నిల్వలపై ఒక అవగాహన ఒప్పందంతో పాటు, ఎల్పీజీ సరఫరాలపై భారత్, యూఏఈ ల మధ్య ఒక ప్రత్యేక ఒప్పందం కుదిరింది. అలాగే.. వ్యూహాత్మక రక్షణ భాగస్వామ్యం కోసం ఒక ఫ్రేమ్‌వర్క్ ఒప్పందంపై ఇరుదేశాల ప్రతినిధులు సంతకాలు చేశారు. భారత పశ్చిమ తీరంలోని వడినార్‌లో ఒక నౌకా మరమ్మతు క్లస్టర్‌ను ఏర్పాటు చేయడానికి ఇరు దేశాలు ఒక అవగాహన ఒప్పందంపై కూడా సంతకాలు చేశాయి.

= = = = = = = = = = = = = = = = = = =

బహుపాక్షికత లక్ష్యాన్ని ముందుకు తీసుకెళ్ళేందుకు అన్ని భాగస్వామ్య దేశాలతో కలిసి పనిచేయడానికి భారత్ అంకిత భావంతో ఉందని విదేశాంగ శాఖా మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ అన్నారు. BRICS విదేశాంగ మంత్రుల సమావేశం-2026 రెండవ రోజు ప్రారంభం సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచంలో బహుపాక్షిక సహకారాన్ని బలోపేతం చేయడానికి నాయకులు ఇచ్చే ప్రాధాన్యతను ఈ సమ్మేళనం ప్రతిబింబిస్తుందన్నారు. అంతర్జాతీయ ఆర్థిక నిర్మాణ వ్యవస్థలో సంస్కరణలు చేపట్టడం అత్యంత ఆవశ్యకమని జైశంకర్ పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = =

భారత దేశ జాతీయ భద్రత ఆత్మనిర్భరతపైనే ఆధారపడాలని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఉద్ఘాటించారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో కలిసి శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తిలో ఈరోజు ఆయన అడ్వాన్స్‌డ్ మీడియం కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ AMCA ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రక్షణ మంత్రి మాట్లాడుతూ, ఆత్మనిర్భర్ భారత్, మేక్ ఇన్ ఇండియా రక్షణ దార్శనికతకు ఆంధ్రప్రదేశ్ ఒక ప్రధాన స్తంభంగా ఎదుగుతోందన్నారు. కొత్తగా ప్రారంభించిన ఈ రక్షణ ప్రాజెక్టులు జాతీయ భద్రతను బలోపేతం చేస్తాయని, పారిశ్రామిక వృద్ధిని వేగవంతం చేస్తూ.. యువతకు పెద్ద సంఖ్యలో ఉపాధి అవకాశాలను కల్పిస్తాయని చెప్పారు. క్లిష్టమైన భద్రతా పరిస్థితులలో భారతదేశం ఆత్మనిర్భరతపైనే ఆధారపడి ఉండాలని, ఆత్మనిర్భర్ భారత్ చొరవ కింద బలమైన, ఆత్మవిశ్వాసం గల భారతదేశానికి స్వదేశీ రక్షణ తయారీయే పునాది అని రక్షణ మంత్రి పేర్కొంటూ...

(వాయిస్…30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = =

డ్రోన్లు, మానవరహిత వైమానిక వ్యవస్థలు వాయుసేన సామర్థ్యానికి దోహదపడతాయని ఎయిర్‌ఫోర్స్ చీఫ్ ఎయిర్ మార్షల్ ఏపీ సింగ్ అన్నారు. మానవరహిత వైమానిక వ్యవస్థల (UAS)పై సెంటర్ ఫర్ ఏరోస్పేస్ పవర్ అండ్ స్ట్రాటజిక్ స్టడీస్ (CAPSS), ఇండియన్ మిలిటరీ రివ్యూ (IMR) సంయుక్తంగా ఈరోజు నిర్వహించిన ఒక సెమినార్ ఎగ్జిబిషన్‌లో ఆయన మాట్లాడుతూ.. ఆపరేషన్ల సమయంలో డ్రోన్లు, మానవరహిత వైమానిక వ్యవస్థలు మానవ ప్రాణాలకు ముప్పును తగ్గిస్తాయని ఏపీ సింగ్ పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = =

విరామం

= = = = = = = = = = = = = = = = = = =

విదేశాంగ శాఖా మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ ఈరోజు న్యూఢిల్లీలో ఉగాండా విదేశీ వ్యవహారాల మంత్రి ఒడోంగో జేజె అబూబఖర్ తో సమావేశమయ్యారు. భారత్ - ఉగాండా దేశాల మధ్య దీర్ఘకాల సహకారం కొనసాగుతున్నదని ఆయన ఒక సోషల్ మీడియా పోస్టులో పేర్కొన్నారు. అంతకుముందు డాక్టర్ జైశంకర్ న్యూఢిల్లీలో ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చీని కలిశారు. పశ్చిమ ఆసియాలో నెలకొన్న పరిస్థితులు, ప్రభావాలపై ఆయనతో చర్చలు జరిపినట్టు సోషల్ మీడియా పోస్టులో ఆయన తెలిపారు. అలాగే.. క్యూబా విదేశాంగ వ్యవహారాల మంత్రి బ్రూనో రోడ్రిగెజ్ పారిల్లాను కలిసినట్టు జైశంకర్ సోషల్ మీడియా పోస్ట్‌లో వెల్లడించారు.

= = = = = = = = = = = = = = = = = = =

విద్యార్థుల భవిష్యత్తు ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యతా అంశమని కేంద్ర విద్యాశాఖా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ పేర్కొన్నారు. న్యూఢిల్లీలో ఆయన ఈరోజు మీడియాతో మాట్లాడుతూ.. విద్యార్థుల పట్ల ప్రభుత్వం సున్నితంగా వ్యవహరిస్తోందని స్పష్టం చేశారు. NEET UG 2026 పునఃపరీక్షను వచ్చే నెల 21వ తేదీన నిర్వహించనున్నట్టు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (NTA) ప్రకటించిందని, పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు వచ్చే నెల 14వ తేదీ నాటికి అడ్మిట్ కార్డులు అందుతాయని వెల్లడించారు. వచ్చే సంవత్సరం నుండి NEET UG పరీక్షను కంప్యూటర్ ఆధారిత పరీక్ష (CBT) విధానంలో నిర్వహించనున్నట్టు మంత్రి తెలియజేశారు. NTAలో సంస్కరణలు అవసరమన్న కేంద్ర మంత్రి.. భవిష్యత్తులో ఎటువంటి అవకతవకలు జరగకుండా పరీక్షా వ్యవస్థను మరింత పటిష్టం చేయనున్నట్టు వెల్లడించారు. అర్హత కలిగిన ఏ విద్యార్థి కూడా ఏ కారణంగానూ తన హక్కులను కోల్పోకూడదని ప్రభుత్వం దృఢంగా భావిస్తోందని కేంద్ర మంత్రి పేర్కొంటూ...

(వాయిస్…25 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = =

మాదకద్రవ్యాల దుర్వినియోగానికి వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటంలో పాలుపంచుకోవాలని భారత ప్రభుత్వ సామాజిక న్యాయం, సాధికారత శాఖ పౌరులకు విజ్ఞప్తి చేసింది. నషా ముక్త్ భారత్ అభియాన్ ఒక ప్రభుత్వ కార్యక్రమం మాత్రమే కాదని, మాదకద్రవ్య రహిత భారత్ ను నిర్మించాలనేది ఒక జాతీయ సంకల్పమని ఆ శాఖ కార్యదర్శి సుధాన్షు పంత్ అన్నారు. నషా ముక్త్ భారత్ అభియాన్ కింద నషా ముక్తి మిత్రగా మారి, మాదకద్రవ్యాల దుర్వినియోగాన్ని ఎదుర్కోవడంలో పౌరులు తమ వంతు సహకారం అందించడానికి, అలాగే.. ఆసక్తిగల ప్రతి పౌరునికి ఒక అధికారిక వేదికను కల్పించడం ద్వారా ఈ ఉద్యమాన్ని ప్రజాస్వామ్యీకరించడమే ఈ చొరవ లక్ష్యమని సుధాన్షు పంత్ తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = =

ఇంధన పొదుపు చర్యలలో భాగంగా భారత అత్యున్నత న్యాయస్థానం వర్చువల్ విచారణలు చేపట్టాలని నిర్ణయించింది. సోమ, శుక్రవారాలు, ఇతర రోజులుగా ప్రకటించిన రోజులలో జాబితా చేయబడిన విషయాలు, అలాగే పాక్షిక పనిదినాలలో చేపట్టే విషయాలు వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా మాత్రమే విచారించబడతాయని సుప్రీంకోర్టు సెక్రటరీ జనరల్ భరత్ పరాశర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంధనాన్ని గరిష్టంగా వినియోగించుకునేందుకు, న్యాయమూర్తులు తమలో తాము కార్-పూలింగ్ ఏర్పాట్లను ప్రోత్సహించాలని ఏకగ్రీవంగా తీర్మానించినట్లు తెలిపారు. రిజిస్ట్రీలోని ప్రతి విభాగంలోను 50 శాతం వరకు సిబ్బందిని వారానికి రెండు రోజుల వరకు ఇంటి నుండి పని చేయడానికి అనుమతించినట్టు తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = =

లక్నో లోని ఏక్నా స్టేడియం వేదికగా చెన్నై సూపర్ కింగ్స్, లక్నో సూపర్ జెయింట్స్ జట్ల మధ్య ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్ జరుగుతోంది. టాస్ గెలిచిన లక్నో జట్టు బౌలింగ్ ఎంచుకోగా.. బ్యాటింగ్ ప్రారంభించిన చెన్నై జట్టు 9 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 69 పరుగులు చేసింది.

= = = = = = = = = = = = = = = = = = = =

కేంద్ర న్యాయ శాఖా మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్.. క్రిస్టియన్ హిర్టే నేతృత్వంలోని జర్మన్ ప్రతినిధి బృందంతో న్యూఢిల్లీలో ఈరోజు సమావేశమయ్యారు. న్యాయ సంస్కరణలు, న్యాయవ్యవస్థ సహకారం, న్యాయ పంపిణీ వ్యవస్థలలో నూతన ఆవిష్కరణల రంగాలలో భారత్-జర్మనీ సహకారాన్ని బలోపేతం చేయడంపై చర్చలు జరిపినట్టు కేంద్ర మంత్రి ఒక సోషల్ మీడియా పోస్ట్‌లో తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = =